## బార్ అసోసియేషన్ సభ్యుల ప్రమాణ స్వీకారం



కార్యవర్గంతో జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప

ఆమనగల్లు, ఏప్రిల్ 4 : ఇటీవల ఆమనగల్లు బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అండేకార్ యాదిలాల్, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు యాదవ్, సంయుక్త కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా కృష్ణ, గ్రంథాలయ కార్యదర్శిగా మల్లేశ్ ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కార్యవర్గానికి జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప, కోర్టు సూపరింటెండెంట్ మురళీధర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జూనియర్ న్యాయవాదులు బార్ అసోసియేషన్ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, న్యాయవాదులు లక్ష్మణశర్మ, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, వెంకట్‌గౌడ్, భాస్కర్ రెడ్డి, జమీల్, జానకీరాములు, కృష్ణయ్య, భాస్కర్ రెడ్డి, మల్లేశ్‌గౌడ్, న్యాయవాదులు మధుగౌడ్, గణేశ్‌గౌడ్, సంతోశ్, మల్లేశ్, మురళీకృష్ణ, ఆంజనేయులు, దేవేందర్, శేఖర్, బీక్యానాయక్, శిరీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ధ్యేయం



మహిళా రైతుకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 4: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ డివిజన్‌లోని మహిళా రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న వ్యవసాయ పనిముట్లను శుక్రవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయాధికారులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సంక్షేమానికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. రైతులకు వివిధ రకాల పథకాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతు అభ్యున్నతితో పాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. రైతులకు సంక్షేమం కోసం ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ పనిముట్లను మహిళా రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. అనంతరం వివిధ మండలాలకు చెందిన మహిళా రైతులకు కల్టివేటర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ రాజారత్నం, మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్, వివిధ మండలాల అధికారులతో పాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలికి సత్కారం



కొందుర్గు, ఏప్రిల్ 4: మండలంలోని మహదేవ్‌పూర్ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయురాలు శ్యామలను సత్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రజిత, మాజీ సర్పంచ్ రాజారామేశ్వర్‌రెడ్డి, రాంచంద్రయ్య, రవీందర్‌రెడ్డి, పులిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



కొందుర్గు, ఏప్రిల్ 4: చౌదరిగూడ మండలంలోరి రావిర్యాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 6వ తరగతి విద్యార్థులు శుక్రవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాలతోపాటు ఉపాధ్యాయులతో గత 7ఏళ్లుగా తమకు ఉన్న జ్ఞాపకాలను పలువురు విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని విద్యార్థులు తమ చదువులను కొనసాగించాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు పవన్‌కుమార్, శివాజీ, ఆఫ్రీన్ బేగం, పల్లవి, మహేశ్‌కుమార్, లింగస్వామి పాల్గొన్నారు.

## ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



కడ్తాల్, ఏప్రిల్ 4: కడ్తాల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001-02 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శుక్రవారం మైసిగండి గ్రామంలోని ఓ కన్వెన్షన్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవరెడ్డి, నిరంజన్, వీరారెడ్డి, ఈశ్వరయ్య, జగత్‌రెడ్డి, పాండయ్య, రామనాథం, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

# మడిగెల కేటాయింపులెప్పుడు?

నీడలేక.. రోడ్డువెంటే చిరువ్యాపారులు, కూరగాయల విక్రయదారులు అమ్మకాలు చేపడుతున్నా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో కూరగాయల మార్కెట్‌లో నిర్మించిన మడిగెలను అందుబాటులోకి తేవడం లేదు. దీంతో వ్యాపారులు, రైతులు ఎండనకా..వాననకా.. రోడ్డు పక్కనే తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఏండ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. వెంటనే మడిగెలను కేటాయించి ఇబ్బందులను తొలగించాలని రైతులు వేడుకుంటున్నారు.
- ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4



సాగర్‌రోడ్డు పక్కనే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

**నీడలేక రోడ్లపైనే కూరగాయల విక్రయం**
**కూరగాయల మార్కెట్ ప్రారంభించినా ఫలితంలేదు..**
**బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.కోటితో నిర్మించిన 44దుకాణ సముదాయాలు**
**నేటికీ అందుబాటులోకి రాని వైనం**
**ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు**

**ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో** చిరువ్యాపారులు, కూరగాయల విక్రయదారులతో పాటు రైతుల ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరువచూపి రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు విక్రయించుకునేందుకు ప్రత్యేక దుకాణ సముదాయాల నిర్మాణానికి గత నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం నుంచి రూ.కోటి విడుదల చేయించి మంచాల రోడ్డులోని పాత పోలీసుక్వార్టర్స్ వద్ద రైతుల సౌకర్యార్థం 44మడిగెలను నిర్మించి పనులు పూర్తిచేయించారు.
ఎన్నికల సమయం నాటికి ఈ మడిగెల నిర్మాణం పూర్తిచేయించారు. కానీ, అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మడిగెలను పట్టించుకోకపోవటంతో అవి నిరుపయోగంగా మారాయి. రైతులు రోడ్లపైనే క్రయవిక్రయాలు జరుపుతూ తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. మంచాల రోడ్డులో నిర్మాణం పూర్తయిన మడిగెలు అందుబాటులోకి తీసుకురావాలని రైతులు, చిరువ్యాపారులు, కూరగాయల విక్రయం దారులు అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకుండా పోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. సాగర్‌రహదారి పక్కన ఉన్న వ్యవసాయ మార్కెట్‌లో షెడ్లు ఉండటంతో అక్కడ కమిషన్ ఏజెంట్ల ద్వారా కూరగాయలు విక్రయిస్తుంటారు. చిరు వ్యాపారులు, ఆకుకూరల రైతులు, అంబేద్కర్ చౌరస్తాలో గతంలో అమ్మేవారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులతో పలువురు ప్రమాదాల బారీన పడేవారు. ఇది పూర్తిగా నివారించేందుకు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మున్సిపల్ అధికారులతో మాట్లాడి కూరగాయల మార్కెట్‌నుమంచాల రోడ్డులో తాత్కాలికంగా షెడ్లు వేయించి అక్కడే ప్రారంభించారు. అనంతరం కోటి రూపాయల వ్యయంతో 44దుకాణాలు నిర్మించారు. వీటిని 2022ఫిబ్రవరి 9న అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. మూడేళ్లు గడుస్తున్నా దుకాణాలను వ్యాపారులకు కేటాయించటంలేదని ఆరోపిస్తున్నారు. ఈ కూరగాయల మార్కెట్‌ను అనుసరించి సమీకృత మార్కెట్‌ను రూ.3కోట్లతో నిర్మిస్తామని, ఇక్కడే కూరగాయలు, మాంసం, పూలు, పండ్లు అన్ని విక్రయించేలా మూడేళ్ల కిందట పనులు ప్రారంభించినా ఆ పనులు ఫిల్లర్ల వరకే పరిమితమయ్యాయి.



నిరుపయోగంగా ఉన్న మార్కెట్ మడిగెలు

**మళ్లీ అంబేద్కర్ చౌరస్తా వద్దే విక్రయాలు..**
నూతనంగా నిర్మించిన దుకాణాలను రైతులకు, చిరు వ్యాపారులకు కేటాయించకపోవటంతో వారంతా ప్రతిరోజూ మళ్లీ సాగర్‌రహదారి పక్కనే విక్రయాలు చేపడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డులో ప్రాణాలు పణంగా పెట్టి విక్రయాలు జరుపుతున్నామని కూరగాయల విక్రయదారులు, రైతులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మంచాల రోడ్డులో పూర్తయిన మడిగలను రైతులకు కేటాయించాలని కోరుతున్నారు.

**అందుబాటులోకి తీసుకురావాలి**



ఇబ్రహీంపట్నంలో నిర్మించిన కూరగాయల మార్కెట్ పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. పండించిన కూరగాయలు ఇబ్రహీంపట్నం తీసుకుపోయి విక్రయించాలంటే రోడ్డుపక్కన పెట్టుకుని విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే మార్కెట్ మడిగెలను అందుబాటులోకి తీసుకురావాలి.
**-మంతని శ్రీకాంత్, యువరైతు**

**రైతుల సమస్యలు కనిపించవా**



ఇబ్రహీంపట్నంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరువతో అనేక పనులు చేపట్టి పూర్తిచేసి ప్రారంభోత్సవాలు చేసినప్పటికీ ప్రస్తుత ఎమ్మెల్యే ఏమి పట్టనట్లుగా వ్యవహరించటం సరైంది కాదు. గతంలో ఈ మడిగెల నిర్మాణం కోసం నాటి ఎమ్మెల్యే మంచిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమణారెడ్డి మార్కెట్‌ను పూర్తిచేసి మాజీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. నేటికీ ఈ మడిగెలను రైతులకు కేటాయించకపోవటం చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఎంత నిర్లక్ష్యంగా ఉందో కనిపిస్తోంది.
**- చిలుకల బుగ్గరాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు**

## నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 4: షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం ఉష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి నెలా ఈ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీ ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా ఎలాంటి సమస్యలు ఉన్నా 9063461297 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మొయినాబాద్, ఏప్రిల్ 4 : గత రెండు నెలల క్రితం అన్న చనిపోయాడని తీవ్ర మనస్తాపానికి గురైన తమ్ముడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాకు చెందిన హరిబాబు(60), లక్ష్మీపార్వతి భార్యాభర్తలు గత 8 సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం మొయినాబాద్‌కు వలస వచ్చారు. మండల పరిధిలోని ఎతుబార్‌పల్లి గ్రామంలో హర్షత్ మోహతా వ్యవసాయ క్షేత్రంలో వాచ్‌మెన్‌గా ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే గత జనవరి మాసంలో హరిబాబు అన్న మృతి చెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన మార్చి నెల 31న పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకట నరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## వాలీబాల్ టోర్నీ ప్రారంభం

కేశంపేట, ఏప్రిల్ 4: మండల పరిధిలోని లింగంధన గ్రామంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నీని నాయకుడు బాబయ్య శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదుగాలన్నారు. కార్యక్రమంలో వంశీకృష్ణ, నర్సింహ, యుగేంధర్, శేఖర్, వెంకటేశ్వర్, శివచారి, యాదగిరి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఘన సన్మానం



మల్లేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్‌సింగ్

ఆమనగల్లు, ఏప్రిల్ 4: ఇటీవల వెల్లడైన గ్రూప్-1 లో రాష్ట్ర స్థాయిలో 187 ర్యాంకు, మల్టీజోన్ 2 విభాగంలో 92వ ర్యాంకు సాధించిన ఆమనగల్లు పట్టణానికి చెందిన కావటి మల్లేశ్‌యాదవ్‌ను శుక్రవారం స్థానిక మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ సింగ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రూప్-1 లో అత్యుత్తమ ర్యాంకు సాధించి పట్టణానికి పేరు తేవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు మల్లయ్య, శ్రీశైలం యాదవ్, శ్రీను, లింగం, బ్రహ్మం, శ్రీనివాస్‌చారి, శ్రీను, బాలకృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు అండగా ఉంటాం

నందిగామ, ఏప్రిల్ 4: నర్సప్పగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో గ్రామానికి చెందిన సంధ్యారాణి రెండు నెలలుగా విద్యార్థులకు సాంఘిక శాస్త్రం బోధించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నేత గోవిందు అశోక్ సొంత ఖర్చులతో ఆమెకు రూ.14,000 నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అండగా ఉంటామని, విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్య కమిటీ చైర్మన్ సువర్ణ, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మిభూపాల్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి, యాదయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

## కష్టపడేతత్వాన్ని అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 4 : పెద్దఅంబర్‌పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్చరల్ మీట్, వార్షికోత్సవాన్ని శుక్రవారం స్థానిక ఇందిరా గార్డెన్‌లో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు విష్ణుమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వివిధ అంశాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మరోవైపు, విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కష్టపడి చదవడాన్ని ఓ అలవాటుగా మార్చుకోవాలని ఎంఈవో జగదీశ్వర్ అన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జయశ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మహేశ్వరి, రిటైర్డ్ హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు దయాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రవీందర్‌రెడ్డి, ఉమాపతి, రాజశేకర్, మాధవి, జ్యోతిర్మయి, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించాలి



నందిగామ, ఏప్రిల్ 4: సింబయాసిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నలజీ డైరెక్టర్ రాజనీకాంత్ అలువాలు ఆధ్వర్యంలో మండలంలోని మొదళ్లగూడ శివారులోని సింబయాసిస్ యూనివర్సిటీలో శుక్రవారం పోల్డ్‌స్కోప్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో చేగూరు లోని శాంతినికేతన్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింబయాసిస్ యూనివర్సిటీ డైరెక్టర్ రాజనీకాంత్ అలువాలు మాట్లాడుతూ.. ఈ వర్క్‌షాపు ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను కలిగించేలా, వారిలోని పరిశోధన శక్తి, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వర్క్‌షాపులు ఎంతో ఉపయోగ పడుతాయని, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సొసైటీలతో రైతులకు మేలు



చెక్కు అందజేస్తున్న చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్

నందిగామ,ఏప్రిల్ 4: చేగూరు గ్రామానికి చెందిన రైతులు కట్న సరిత రూ.10లక్షలు, యాదయ్య రూ.10లక్షలు, మల్లేశ్ రూ.5లక్షలు, అంజయ్యకు రూ.5లక్షలు చేగూరు సొసైటీ ద్వారా మంజూరైన రుణాలకు సంబంధించిన చెక్కులను శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ అశోక్, వైస్ చైర్మన్ పద్మారావు, సీఈవో వెంకటయ్యతో కలిసి రైతులకు అందజేశారు. ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, రుణాలు, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

## రోడ్డంతా దుర్వాసనే..



కుంట్లూరు చౌరస్తాలో మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగు

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 4: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు చౌరస్తాలో మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతున్నది. మ్యాన్‌హోల్ నుంచి వస్తున్న మురుగు దాదాపు కుంట్లూరు-తట్టిఅన్నారం మార్గంలో వంద మీటర్లకు పైగా దూరం రోడ్డుపైనే పారుతున్నది. పాదచారులతోపాటు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న వర్షానికే మురుగునీటి వ్యవస్థ దారుణంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. మురుగు సమస్యను తీర్చాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న వాహనం

**నిలిచిన విద్యుత్ సరఫరా**



మొయినాబాద్, ఏప్రిల్ 4 : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడటంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఈ ఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా, ఆ పక్కనే విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. అయితే శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో శ్రీరాంనగర్ వైపు నుంచి మొయినాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. విద్యుత్ స్తంభం ముక్కలుగా అయ్యింది. దీంతో రాత్రి 3 గంటల నుంచి శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రామానికి పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఉక్కబోతకు గురయ్యారు. మధ్యాహ్నం తరువాత విద్యుత్‌ను పునరుద్ధరించారు.

## విద్యార్థులు కరాటేలో రాణించాలి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో కరాటే మాస్టర్ చెన్నయ్య తదితరులు

షాబాద్, ఏప్రిల్ 4: విద్యార్థులు చదువుతోపాటు కరాటేలో రాణించాలని జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా తెలంగాణ స్టేట్ స్కూల్ స్పోర్ట్స్ కరాటే రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని ఆస్పల్లిగూడ గ్రామ సమీపంలో కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న మొగిలిగిద్ద గురుకుల పాఠశాల విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించారు. అనంతరం కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్ట్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు కరాటేలో రాణించాలని సూచించారు. చదువుతోపాటు ఆటలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శివరంజని, ఉపాధ్యాయులు పద్మిని, రేణుక, నాగజ్యోతి, సత్యమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో బట్టల దుకాణం దగ్ధం



దుకాణంలో కాలిబూడిదైన సామగ్రి

ఆమనగల్లు, ఏప్రిల్ 4: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ బాలాజీ మెన్స్ వేర్ అండ్ కిడ్స్ వేర్ బట్టల దుకాణంలో శుక్రవారం ఉదయం 4 గంటల సమీపంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వస్తువులు అన్ని అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.15 లక్షలపైన నష్టం వాటిల్లినట్లు నిర్వాహకుడు ప్రవీణ్ తెలిపాడు. తన జీవనోపాధి కోల్పోయానని ప్రభుత్వం, దాతలు మానవత దృక్పథంతో తనను ఆదుకోవాలని బాధితుడు ప్రవీణ్ వేడుకున్నాడు.

## పార్కు చేసిన బైక్ అపహరణ

మొయినాబాద్, ఏప్రిల్ 4: పార్కు చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతానికి చెందిన పి.రామకృష్ణారెడ్డి శుక్రవారం ఉదయం మొయినాబాద్‌లోని తమ బంధువుల ఇంటికి వచ్చాడు. తన మోటర్ సైకిల్‌ను మున్సిపాలిటీ కేంద్రంలోని పశువైద్యశాల వద్ద పార్క్ చేసి పని నిమిత్తం చేవెళ్లకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.